# అత్తగారూ_ అచ్చుతప్పులూ

## 'భానుమతీ రామకృష్ణ'

అమధ్య మాచాకలి ఉన్నట్లుండి మావారి పదిహేను పంచలూ ఒక్కసారిగా పారేశాడంటూ బట్టల లెక్క చూస్తున్న మా అత్తగారు పద్దుపుస్తకం ఎత్తి కింద పడేశారు కోపంతో.

''అంట్లవెధవ అబద్ధా లాడకుండా చెప్పు. ఏమైనాయి పదిహేను పంచలు!'' అంటూ నిలేశారు చాకల్ని.

అన్యధా శరణం నాస్తి అంటూ చెట్టంత చాకలీ అమాంతంగా మా అత్తగారిముందు సాష్టాంగపడ్డాడు. "ఆ పంచలే నాకేయ్‌లేదండమ్మగారూ'' అంటూ.

''నోర్మూయ్ దొంగభడవా! ఇంత అబద్ధాలా! నిక్షేపంలాంటి పిల్లవాడి నిక్కరు పారేస్తే పారేశావ్—బంగారంలాంటి పదిహేను పంచలూ ఏం చేశావో చెప్పు!" అంటూ బడిపంతులల్లే పెన్సిలు ఝళిపించారు.

నేలకంటుకుపోయిన చాకలి భూదేవితో మొరబెట్టుకున్నాడు. "ఆ తిరపతి ఎంకన్న సాక్షిగా ఆ పంచలుగానీ, నిక్కరుగానీ, నాకేయ్‌లేదం డమ్మగారూ,'' అంటూ.

''ఛీ నోర్మూయ్ దొంగగాడిదా. నీ తలకాయంత అక్షరాల్తో రాసిన నా లెక్క తప్పంటావుట్రా! లెక్క పొరపాటు నావంశంలో లేదు—తెలిసిందా!"

''బుద్ది బుద్ది—ఎంతమాటన్నారమ్మగారు!—ఒకేళ పొరపాట్న—

"ఛీ వెధవా మళ్ళీ అదేమాట, పళ్ళు రాలగొట్టేవాళ్లులేక—పొరపాటు రావడానికి ఒకటా రెండా! పదిహేను పంచలు—యిట్టా కొన్నవి—అట్టా వేశాడు — బిడ్డ ఒక్కసారైనా కట్టుకున్నాడో లేదో — కొత్తపంచలు — తల్చుకుంటే కడుపు భగ్గుమంటోంది. నీ దొంగవేషాలు కట్టిపెట్టి మర్యాదగా లేచి నిలబడి సమాధానం చెప్పు. ఏంచేశావ్ పంచలు!" అంటూ పై గాంధారంలో గర్జించారు మా అత్తగారు. అప్పటికే సగం చచ్చిపోయిన చాకలి మెల్లిగా లేచి కండ్లు తుడుచుకుంటూ నిలబడ్డాడు.

''ఏ పెమాణం చేయమంటే ఆ పెమాణం చేస్తానం డమ్మగారు;



ఈసారి సలవకి నా కొక్కపంచగూడా పళ్ళేదం డమ్మగారూ" అంటూ వాపోయాడు.

"మళ్ళీ అదేపాటా! సరే, యిహ వీడిట్లాట్లా చెప్పడే. వీణ్ణి అడిగే విధంగానే అడగాలి. పిలిపించు పోలీసుల్ని," అంటూ హడావిడిగాలేచి నిలబడ్డారు మా అత్తగారు. పోలీసులమాట వినగానే చాకలివాడితోబాటు నేను గూడా హడిలిపోయాను.

వాళ్ళను పిలిస్తే ఎన్ని యిబ్బందులున్నాయో మా అత్తగారికి తెలీదని నాకు తెలుసు. అసలు పంచలు పోవడానికి వాళ్ళకు తగినన్ని ఆధారాలు దొరికిం



దాకా వాళ్ళతోబాటు మనంకూడా అవస్థ పడాలి. చిన్నవిషయమైనా, పెద్దవిషయమైనా వాళ్ళదాకా వెళితే బ్రహ్మాండమైన విషయమై పూరుకుంటుంది.

ఆ మధ్య మావారి స్నేహితుడు రావుగారు ఈలాంటి యిబ్బందిలోనే పడ్డాడు. కారు డ్రైవ్‌చేసుకుంటూ రోడ్డు మీద పోతున్న రావుగారు వూరుకోకుండా, తనకారుకు యాభై గజాల దూరంలో అరిటిపండు తొక్కమీద కాలువేసి నడిరోడ్లో జారిపడ్డ ఒక ఆడమనిషి దగ్గిరకెళ్ళి 'సడన్‌బ్రేక్'వేసి కాపాడాడు. అంతటితో వూరుకోకుండా కారు దిగి ఆ పడిన మనిషి దగ్గిరి కెళ్ళి 'దెబ్బేమైనా తగిలిందా,' అంటూ విచారించాడు. ఈలోపుగా నలుగురూ గుంపు చేరారు. కాలుజారి రోడ్డుమీద పడ్డ ఆ ఆడమనిషి తనచుట్టూ గుంపు చేరే సరికి సిగ్గుపడిపోయి 'ఏమీ దెబ్బతగల్లేదంటూ పక్కనే వున్న గుడిసెల్లోకి వెళ్ళిపోయిందట.... యింక అక్కడ చేరిన గుంపంతా అరిటిపండు తొక్కను ఒదిలేసి, రావుగార్నీ, ఎముకలగూడులాంటి ఆయన 'ఓల్డు మోడలు, 'ఆస్టిన్' కారునూ ఒకసారి కొరకొరచూశారట.

ఇదేమిట్రాబాబూ అనుకుని ఎందుకైనా మంచి దని పెద్దమనిషల్లే జరిగిన యదార్థం పోలీస్టేషన్లోచెప్పి వెళదా మని వెళ్ళాట్ట రావుగారు. 'ఎవరో ఆడమనిషి' అంటూ రావుగారు అసలు విషయం చెప్పేలోగానే 'ఆ మనిషి చచ్చిపోయి ఎంతసేపయింది. యాక్సిడెండ్ జరిగిన చోటు యిక్కడికి ఎంతదూరంలోవుంది. అసలు కారుకింద మనిషి పడ్డదా లేక కారు ఆవిడమీద పడ్డదా' అంటూ రావుగారిచుట్టూ చేరిన పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించి ఉక్కిరిబిక్కిరిచేశారట.

ఆవిడ చనిపోలేదనీ, యాక్సిడెంట్ అసలే జరగలేదనీ, కనీసం తన కారు కూడా ఆవిడజోలికి పోలేదనీ, పొరపాట్న ఆవిడే తనకారుమీద పడినట్లయితే తన కారుకే 'యాక్సిడెంట్' జరిగేదనీ, వాళ్లకు నచ్చజెప్పేసరికి తలప్రాణం తోక్కొచిందట.

"అయినా డ్యూటీ అంటే డ్యూటీయే. పదండి ఆమనిషిపడ్డ చోటుకు'' అంటూ యిద్దరు పోలీసులు రావుగారి కార్లో ఎక్కి కూర్చున్నారట. చచ్చాన్రాబాబూ, ఎరక్కపోయి చెప్పానే అని మనసులోనే బాధపడ్డా రావుగారు చేసేదేంలేక తిన్నగా ఆ పోలీసుల్ని అక్కడికి అరుమైళ్ళ దూరంలో వున్న ఆ మనిషి పడ్డ చోటుకు తీసుకొచ్చాట్ట! కారు ఆపుతోనే పోలీసులు హడావిడిగా దిగి అరిటి తొక్కకోసం రోడ్డంతా వెతికారట. ఎక్కడా కనిపించకపోయేసరికి మళ్ళీ వాళ్ళుకూడా రావుగార్నీ, ఆయనకార్నూ గురగురా చూశారట. వెంటనే మనిషి పడ్డచోటునూ, కారు నిలబడ్డంతవరకూ రోడ్డునూ, చిక్కిశల్యావస్థలో వున్న కార్నూ చేపుతో కొలవడం మొదలెట్టారట.



అయోమయంగా చూస్తున్న ఎనిమిదడుగుల రావుగార్నికూడా తాటిచెట్టును కొలిచినట్లు ఒకసారి నిలువునా చేపుతే కొల్చారట.

అంత చిన్న కార్లో అంతపొడవు మనిషి ఎల్లా కూర్చోగలిగాడా అని పోలీసువాళ్లకు సందేహంకలిగి తక్షణం రావుగారి తల చూశారట. రాగిచెంబులాగా మెరుస్తున్న రావుగారి తలమీద తాటికాయల్లాంటి బొప్పెలు చూసి తల లూపి సమాధానపడ్డారట. అక్కడ పడిన ఆడమనిషికోసం చుట్టుప్రక్కల గుడిసెలన్నీ గాలించారట పోలీసులు.

ఆవిడ వచ్చి వెంటనే వెళ్లిపోయిందన్నారట అక్కడివాళ్ళు. ఆవిడ ఎక్కడికెళ్లిందో ఆ అడ్రసుతీసుకుని మళ్లీ రావుగారి కార్లో బయల్దేరారట. వెళ్ళేదార్లో హోటలు కనిపించే సరికి కాఫీ తాగాలన్నారట పోలీసులు. భక్తుడిలాగా వాళ్ళకు కాఫీగట్రా యిప్పించి తనూ కాస్త కాఫీ గొంతులో పోసుకువచ్చి కార్లోకూర్చున్నాట్ట. రావుగారూ నాకూ కాఫీ యిస్తేనేగాని కదల నంటూ పెట్రోలయిపోయినకారు సత్యాగ్రహం చేసిందట. "కష్టాలన్నీ ఒకేసారి వస్తుంటాయి" అన్నాట్ట అందులో ఒక పోలీసు నవ్వుతూ. అసలే చిర్రాకుతో లోలోపల మండిపోతున్న రావుగారు "సంతోషించాంలే నీసానుభూతికి అని పైకి అనబోయి లోప లనుకుని, అక్కడికి అరమైలు దూరంలోవున్న పెట్రోలు బంకుదాకా కారు తోసుకుంటూ వెళ్లాడట పోలీసుల్ని కార్లో కూర్చోబెట్టి. పెట్రోలు వేసుకుని ఎలాగో తిరిగి తిరిగి ఆవిడ అడ్రసు కనుక్కొని తీరా విచారిస్తే, ఆవిడ అక్కడికూ్కడా రాలేదనీ, బహుశా అక్కడికి యాభైమైళ్ళ దూరంలోవున్న వాళ్లపల్లెటూరుకెళ్ళి వుంటుందనీ చెప్పారట పక్కయిండ్ల వాండ్లు. యాభైమైళ్ళు రావుగారి రోగిష్టి కారు పోగలుగుతుందాన్న సందేహంతో కారువైపు చూశారట పోలీసులు. "నేపోతాన్రో మొర్రో అంటూ 'బావురు' మన్నట్లు కనిపించిందట రావుగారికారు.

అంతదూరం అలాంటి కార్లోవెళ్లడానికి భయపడ్డ పోలీసులు తిరుగుముఖం పట్టారట. 'బ్రతుకు జీవుడా' అంట్లూ వాళ్లను పోలీస్టేషన్లో దింపి పోబోతున్న రావుగార్ని ఆపి "రేపు మీరు మేస్ట్రేట్ కోర్టుకు ఈ కేసు విషయంగా వెళ్లాల్సుంటుంది కాబట్టి ప్రొద్దుటే తొమ్మిది గంటలకంతా యిూవైపొచ్చి మమ్మల్ని కూడా 'పికప్' చేసుకుని వెళ్లండి. అంటూ ఆజ్ఞాపించారట ఆయిద్దరు పోలీసులూ. పాపం ఆ అర్థంలేని యాక్సిడెంట్‌కోసం అరడజనుసార్లు కోర్టు చుట్టూ తిరగాల్సొచ్చిందట రావుగారు. మా అత్తగారు పోలీసులనంగానే నాకా

గాథంతా ఒక్కసారి జ్ఞాపకం వచ్చి బెదిరిపోయాను.

ఇంక వాళ్ళొచ్చినప్పట్నుంచీ ఆ పంచలు ఏ రంగు అంచువి? ఎప్పుడు కొన్నవి? ఏషాపు. వాటిబిల్లు, ఖరీదు, వాటిమీద 'యిన్షియల్' వగైరా అన్నీ అడుగుతారు. అన్నట్లు మా చాకలి వుతికే ఏబట్టలమీదకూడా 'యిన్షియల్' అంటూ వుండదని నా కప్పుడు గుర్తుకొచ్చింది. ఏగుర్తూ లేకుండా పంచ లెక్కడపోయాయో తెల్సుకోడం పోలీసులకూడా కష్టమేమో ననిపించింది. ఆసంగతి మెల్లిగా మా అత్తగారి చెవులో చెప్పాను.

"యీ మాత్రంకూడా కనుక్కోలేకపోతే యింకా పోలీసు లెందుకే అడుక్కుతిన్నా?" అన్నారు గట్టిగా అరుస్తూ.

"నిక్కరు పారేస్తే పారేశావ్. ఆ పదిహేను పంచలూ ఏంచేశావో చెప్పు యింతకైనా. లేదంటే తక్షణం పోలీసుల్ని పిలిపించి నీతాట ఒలిపిస్తాను" అంటూ మళ్లీ బెదిరించారు చాకల్ని.

చాకలి మళ్ళీ ఏడవబోయాడు. ఎంత ప్రయత్నించినా కండ్లల్లో నీళ్ళు రాకపోయేసరికి చీదేస్తూ, ఒట్టి కండ్లు తుడుచుకోడం మొదలెట్టాడు.

"బంగారంలాంటి పదిహేను పంచలూ మింగేసి ముచ్చులాగా ముసలి కన్నీళ్లు వదిత్తే విడిచిపెడతారనుకున్నావుట్రా!"

"ఇంకా చూస్తా వేమిటే! టెల్లిఫోన్ చేసి పిలిపించు పోలీసుల్ని" అంటూ మా అత్తగారు నన్ను డబాయిస్తుండగానే మావారు టెలిఫోన్ చేశారు ఆఫీసునుంచి. రాత్రి కెక్కడో డిన్న రుందనీ, భోజనానికి తనకోసం కాచుకోవద్దనీ చెపుతూ వాళ్ళమ్మగారి కేకలు ఫోన్‌లోకూడా వినిపించి "ఏమిటీ! మాఅమ్మ ఎవరిమీదనో అరుస్తున్నట్లుందే?" అని అడిగారు. చాకలి పదిహేను పంచలు పారేశాడని చెప్పాను. "అరెరె! పదిహేను పంచలూ పారేశాడా! అయితే మరి వాడేమంటున్నాడు!" అన్నారు.

"అసలా పంచలే నాకెయ్యలేదంటున్నాడు."

"లెక్క సరిగా చూశారా! ఎవర్రాశారు!"

"మీ అమ్మగారే. చాకలివాడి తలకాయంత అక్షరాల్తో."

"అయితే యిప్పుడు మా అమ్మేఁవంటోందీ!"

"తక్షణం పోలీసుల్ని పిలవమంటూంది."

"ఛాఛా. వాళ్ళెందుకూ అనవసరంగా! 'అదొక న్యూసెన్సు' ఒద్దని చెప్పు. వాళ్ళొచ్చి వాడివీపు చితగ్గొట్టి నానా గందరగోళం చేయడంతప్ప. ప్రయోజనం లేదు. 'కంప్లైంట్' యిచ్చినందుకు వాళ్లచుట్టూ, కోర్టుచుట్టూ మనం తిరగాలి. ఆ మధ్య మనరావుగాడు తిరిగి



నట్టు. మాట్లాడకుండా వాణ్ణి పంపించెయ్యండి. ఇకమీద వాడికి బట్ట లెయ్యకుండావుంటేసరి" అన్నారు మావారు.

ఈ సంగతి మా అత్తగార్ని యివతలకు పిల్చి చెప్పాను.

"హయ్యో నెత్తిరాత. వాడంతకంటే యింకేఁవంటాడులే. అన్నీ వాడి కాతంఁడ్రి బుద్ధులే వచ్చాయి." అంటూ కొడుకుమీద కాసేపు విసుక్కొని చాకలివాడికి ఆఖరు 'వార్నింగ్' యిచ్చారు. "రేపు మధ్యాన్నం లోపుగా పంచలు తెస్తే తెచ్చినట్టు, లేదాంటే తక్షణం పోలీసులకు పట్టించి అండమాన్ దీపాలకి పంపించి జన్మఖైదు వేయిస్తాను. జాగర్త" అంటూ ఒక్క విసుర్న పద్దుపుస్తకం నా ముఖాన పారేసి స్నానానికి వెళ్లిపోయారు మా అత్తగారు.

"చివరిసారి చీదేసి చాకలిగూడా కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయాడు."

ఆరోజంతా చాకల్నితిడ్తూనే వంటా, వడ్డనా చేసుకున్నారు మా అత్తగారు.

మర్నాడు మధ్యాన్నం చాకలికోసం కాచుక్కూర్చున్నారు. వాడు రాలేదుగాని తల్లికి జబ్బుగా వుందని తంతి వస్తే, వెళ్ళిన మా వారి పనిపిల్లవాడొచ్చాడు వూర్నుంచి. వాడొస్తూనే 'అయ్యగారి పదిహేను పంచలూ పోయాయిరా' అన్నాను.

"అర్! అన్యాయంగా వుందే! బహూశా నేనూరి కెళ్లానని తెలిసి వాడీ



"ఇదిగో! మళ్లీ నువ్వు దూద్‌హల్వా చేసినట్టూ, నేను తినినట్టూ కలవచ్చింది."
"వచ్చినట్టే ఉంది. ఈ తలగడలో సగందూది కనపడదు."

నాటకం ఆడుంటాడు. నేనే గదమ్మా పదిహేను పంచలూ వేసి బిల్లుకూడా తీసుకొచ్చాను! వుండండి నే నిప్పుడే వెళ్ళి ఆ లాంఁడ్రీవాడి పని పట్టిస్తాను" అని వాడంటూంటే వెలవెల బోతున్న మా అత్తగారు.

"లాంఁడ్రీ ఏమిట్రా! చాకలి పారేశాడంటూంటే" అన్నారు.

"అబ్బే! లేదమ్మా. చాకలి మూటలోనించి నేనే తీశాను. అయ్యగారు పంచల్లేవంటే 'అర్జంట్ వాష్'కి వేశాను. మా వూర్నుంచి తంతి రాగానే ఆ గొడవలో యీ సంగతి మీకు చెప్పడం మర్చిపోయాను. బిల్లు కూడా అయ్యగారి

బీరువా సొరుగులో పెట్టే వెళ్లాను. మీరు చూణ్ణే లేదన్నమాట’’ అంటూ నసిగాడు.

“ఎట్టా చూస్తాంరా మొద్దువెధవ! లెక్కరాసి మూటగట్టి పడేసిన మురికి గుడ్డల్లోంచి నువ్వు పంచలు మాత్రం తీసి లాండ్రీకేస్తావని నేనేం కలగన్నానా! చెప్పక్కర్లా! బుద్ధి, జ్ఞానం లేని కుర్ర వెధవల్నంతా యింటిపనికిపెడితే ఇంతే” అంటూ, పనివాడిమీద మండిపడుతున్న మా అత్తగారు సడన్‌గా లేచి గబగబా లోపలికెళ్లారు, ఏదో పనివున్నట్లు. ఏమిటాని వెనక్కి తిరిగిచూశాను. చాకలి నన్ను చూస్తూనే మళ్ళీ ఒకసారి బలవంతంగా ఏడవబోయాడు. నాకు నవ్వొచ్చింది వాడి అవస్థకు. “ఒద్దొద్దు. ఇహ ఏడవక్కర్లా. పంచలు దొరికాయి” అన్నాను.

“అమావాస్యనాడు చంద్రుడు కనిపించినట్లు” నల్లటివాడి ముఖంనిండా ఒక్కసారి తెల్లటి పండ్లు కనిపించాయి.

“చూశారా చిన్నమ్మగారూ! నా మీద ఎంతపెద్ద అబాండం ఏశారో పెద్దమ్మగారు. ఏరమ్మా పెద్దమ్మగారూ!” అని అడిగాడు చాకలి.

“ఆవిడ ప్రస్తుతం నీకు కనిపించరు. లోపల చాలాపనిలోవున్నారు” అన్నాను.

నాకు తెలుసు ఆలాంటి క్లిష్ట సమస్యలు మా అత్తగారు నాకే ఒదిలేస్తూంటారని.

“అయితే మరి మాసిన బట్ట లెయ్యరామ్మా”, అని అడిగాడు చాకలి దీనంగా. పాపం అనిపించింది.

ఏం చెప్పాలో తోచక రెండురోజులు ఆగి రమ్మని పంపించేశాను చాకల్ని.

వాడటు వెళ్తానే మా అత్తగారు లోపల్నించి వచ్చారు. “ఏడీ చాకలి వెధవ వెళ్ళిపోయాడా” అంటూ.

“నేనే పంపించేశాను. మురికి బట్ట లెయ్యమన్నాడు. రెండురోజులు తాళి రమ్మన్నాను.’’

“ఎన్నిరోజులు తాళొచ్చినా పిల్లవాడి నిక్కరు సంగతి తేలిందాకా మళ్ళీ వాడికి బట్టలెట్టా వేస్తాం!. నిక్షేపంలాంటి కొత్త కాకీ నిక్కరు” అని మా అత్తగారంటూండగానే “ఆ కొత్త కాకి నిక్కరే నామ్మా! అయితే సాకలోడి మూట్లోనించి నేనే తీసి సబ్బేసి గుంజేసినా, సిన్నయ్యగారు కావాలంటే”. అన్నది అప్పుడే యిల్లు చిమ్మడానికి వచ్చిన పనిమనిషి పిచ్చమ్మ. మా అత్తగారు నా ముఖం చూళ్లేక పడ్డ అవస్థ నేను చూడలేక మెల్లిగా ముందు హాల్లోకి తప్పుకున్నాను.

“టెలిగ్రాం” అంటూ పోస్ట్‌మేన్ కేక విని వరండాలోకి వెళ్ళాను. టెలిగ్రాంతోబాటు ఒక శుభలేఖ కూడా వచ్చింది. యీలోపుగా మా అత్తగారు కూడా ఖంగారు పడుతూ వచ్చారు. “టెల్లిగ్రాపు ఎక్కణ్ణుంచే” అంటూ.



‘‘మీ అమ్మాయి దగ్గిర్నుంచే.”

‘‘ఆ! ఏమిటీ! ఏమనిచ్చిందే! నా తల్లి ఒళ్ళికి ఏంలేదుగదా” అంటూ అదుర్దా పడ్డారు.

“ఏంలేదు ఆరోగ్యంగానే వున్నారు. రేపు మెయిల్లో వస్తున్నానని యిచ్చారు అంతే,’’ అన్నాను.

“హమ్మయ్య, నా తల్లి ఒస్తోందా! ఎన్నాళ్లయిందో చూసి. కండ్లు కాయలు కాచాయి’’ అన్నారు, ఆ ర్నెల్లక్రితం మా ఆడబిడ్డను చూసొచ్చిన మా అత్తగారు ఆనంద బాష్పాలు విడుస్తూ.

“ఆ శుభలేఖ ఎవరిదే.’’

“ఎవరో అచ్యుతరామయ్యగారుట. ఆయన మనవడిపెళ్ళిపత్రిక. ఈఊర్లోనే మైలాపూర్లో పెళ్లిట.’’

‘‘ఓహోహో! అట్టా చెప్పు! ఆ పెళ్లికే అమ్మాయిగూడా వస్తూందన్నమాట! ఎవరనుకున్నావ్! అమ్మాయి ఆడబిడ్డ కొడుకు పెళ్ళే!” అన్నారు అర్థంగాక చూస్తున్న నన్నుచూసి.’’

‘‘అన్నట్టు మే లెన్నింటికొస్తుందే,” అన్నారు.

‘‘ప్రొద్దుటే ఒస్తుందనుకుంటాను,’’ అన్నాను, నాకూ టైముతెలీక.

“నీకూ తెలీదన్నమాట. అయితే అబ్బాయికి కాస్త టెల్లిఫోనుచేసి కనుక్కోమే లెన్నిగంటలకొస్తుందో రేపు. బిడ్డ రాత్రి ఫోంచేసి బయల్దేర్తుందో లేక అట్టాగే బండెక్కుతుందో! ఒస్తూనే



“నా కిక్కడ కూచుంటే, ప్రియా, మనం మొదట కలుసుకోవడం జ్ఞాపకం వస్తుంది. అప్పుడు నాకు ఇరవై, నీకు పదహారేళ్ళు! ఇప్పుడో, నాకు నలభై ఐదు వచ్చాయి. నీకు కష్టంమీద ఇరవయి వచ్చాయి!”

నైనా నాలుగు మెతుకులు తినకపోతే దానికి కండ్లు తిరుగుతాయి. పైగా దానికి దంపుడుబియ్యం తప్ప మనం మింగే మరబియ్యం దాని ఒళ్లికొక్కాదు” అంటూ అప్పటికప్పుడు వడ్లకొట్టు తెరిచి ఒక బస్తా ఒడ్లు తెచ్చి పనిమనిషిముందు పోసి దంచమన్నారు. “రోకలి విరిగిపోయిందమ్మా” అన్నది పనిమనిషి. అది తప్పించుకోడానికి ప్రయత్నిస్తోందనుకున్న మా అత్తగారు పక్కింటి నుంచి రోకలి తెచ్చి దంపమన్నారు.

కొడుకు ఎన్నిసార్లు ఉప్పుమిరపకాయలు వూరవెయ్యమన్నా యిదుగో ఎండరానీ, అదుగో మజ్జిగ మిగల్నీ

అంటూ కాలంగడిపిన మా అత్తగారు, కూతురుకోసం అప్పటికప్పుడు పచ్చి మిరపకాయలు చీరి మజ్జిగలో వేశారు. ఊరగాయలు కొద్దికొద్దిగా తీసి రాచ్చిప్పలకు పట్టించిపెట్టారు.

''దానికి చింతకాయపచ్చడంటే ఎంతో యిష్టమే'' అంటూ మా చిన్నాన్న నా కోసం పంపించిన చింతకాయ తొక్కు కాస్తా తీసి కూతురుకోసం నూరి అట్టే పెట్టారు. "దానికి పొట్లకాయ వేపుడంటే ప్రాణం" అంటూ విత్తనాలకోసం అట్టే పెట్టిన రెండు పొట్లకాయలూ కోసుకొచ్చి పడేశారు.

"మెంతిపిండి తప్ప అంగట్లో కొన్న విసకలాంటి సీకాయి అది జన్మకు తల మీద వేసుకోదే'' అంటూ మెంతులూ, సీకాయీ నానేశారు.

"సున్నిపిండి తప్ప సోపులూ గీపులూ దాని కలవాట్లేదే" అంటూ అప్పటికప్పుడు తిరగలి ముందేసుకుని, సున్ని పిండి విసరటం మొదలెట్టారు.

సున్నిపిండిలోకి కచ్చూరాలూ గట్రా సమయానికి యింట్లో లేకపోయెనే అని బాధపడ్డారు కాసేపు. "అన్నట్లు రామేశ్వరంనుంచి వస్తూ శ్రీ విల్లిపుత్తూరు ఆండాళ్లు వాసన చెక్కపొడి తెచ్చి నీకిచ్చానే, ఎక్కడే అదీ? వుంటే కాస్తివ్వు పిండిలో కలుపుతాను. లేకపోతే పచ్చి వాసనేస్తుంది పిండి" అంటూ అడిగి పుచ్చుకున్నారు.

"అయ్యో నా మతిమరుపు మండి పోనూ, అసలది వడియం లేకపోతే నోట ముద్దబెట్టదే" అంటూ వడియాలకు పప్పు నానబోసి, గుమ్మడికాయకోసం పక్కింటివాళ్లకు కబురు పెట్టారు.

మా అత్తగారు వడియాలు వేస్తే నాలుక్కాలాలపాటు వుండేట్టు వేస్తారు. అవి మనుషుల పళ్ళను గట్టిపరచడమో, లేక వూడగొట్టడమో తేల్చేస్తాయి. ఆ వడియాలు కంచంలో వేసేప్పుడే వడగళ్ళ శబ్దం బయల్దేర్తుంది.

ఐదుసంవత్సరాల క్రితం ఒకసారి మాకోసం వడియాలు వేశారు మా అత్తగారు. ఖర్మంజాలక అప్పుడే మా నాన్నగా రొచ్చారు వూర్నుంచి.

"అన్నగారూ, కొత్తగా వడియాలు వేశాను. యింకా బాగా ఎండలేదనుకోండీ, అయినా ఎట్టావున్నాయో కాస్త రుచి చూడండి" అంటూ నాలుగు వడియాలు మా నాన్నగారి కంచంలో వడ్డించారు మా అత్తగారు.

"భేష్ భేష్, గుమ్మడివడియాలంటే నా కిష్టమని మీ కెట్లా తెలిసిందీ" అంటూ సంతోషపడిపోతున్న మా నాన్నగారు వడియాన్ని తుంచడానికి ప్రయత్నించారు; చేతకాలా. కొరకటానికి ప్రయత్నించారు; లాభంలేక పోయింది. మొత్తం వడియం నోట్లో వేసుకోడానికి ప్రయత్నించారు. చేటంత వడియం నోట బట్టలా. చాలాసేపు అవస్థపడ్డారు.



"ఏం అన్నగారూ వడియా లెట్లా వున్నాయి."

"బాగానే వున్నాయిగానీ, వీటిని కాస్త పొడిగా కొట్టించి వేస్తూండండి". అన్నారు మా నాన్నగారు కొరకరాని కొయ్యల్లా వున్న ఆనాలుగు వడియాల్ని కంచంలో ఓమూలకు తోస్తూ. ఆతర్వాత మా అత్తగారు ఏమనుకున్నారో ఏమో మళ్లీ ఆ వడియాలు వేయించాలేదు; ఎవరికీ వడ్డించాలేదు. గప్‌చిప్‌గా వూరుకున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పాత చింకిచాప నంటిపెట్టుకొని బయట్నేపడున్న ఆ వడియాలమీద చివరకు మావాడు జాలిపడ్డాడు. తక్షణం వాడూ, వాడిస్నేహితులు కొందరూ కలిసి, కొన్నివడియాల్ని రాకెట్స్‌లాగా ఆకాశానికి పంపే ఏర్పాటు చేశారు. చాలావరకు ఆకాశానికి పంపగా మిగిలిన వడియాల్లో కొన్ని కాకుల్నీ, కుక్కల్నీ తరమడానికి ఉపయోగించారు. ఆ తరమడంలో ఒక వడియం ఎవరో పిల్లవాడి కణతకు తగిలి చిల్లి పడి బొట బొట రక్తం కారింది.

యీ సంగతి విన్న ఆ పిల్లవాడి తల్లి, ఎవరో రాయితీసు కొట్టి అబద్ధాలాడుతున్నారనీ, వడియంలో అంత దెబ్బ తగలడం అసంభవమనీ మా యింటి మీదికి యుద్ధాని కొచ్చింది. మేమంతా ఆవిడ కాళ్లూ గడ్డాలూ పట్టుకుని బ్రతిమాలి, అది రాయికాదనీ, వడియమేననీ,



మేస్టరు : ఈ చిన్న లెక్క అయినా చెప్పు చూద్దాం. మీ నాన్నగారు నా దగ్గిర 100 రూపాయలు అప్పు తీసుకుని, నెలకు 20 చొప్పున బాకీ చెల్లువేస్తా నన్నా రనుకో. మూడునెల్లయాక బాకీఎంతతీరుతుంది.

పిల్లవాడు : ఏమీ తీరదండీ.

మేస్టరు : తెలివితక్కువదద్దమ్మా!

పిల్లవాడు : నేను దద్దమ్మనుకాదండి. మానాన్న సంగతి మీకు తెలీదండీ.

పొరపాట్న తగిలిం దనీ, నచ్చచెప్పి ఆవిడకి నమ్మకం కలిగేందుకు చాప మీద పడున్న మిగతా వడియాలు చూపించాం. అప్పటికి సమాధానపడి "దిక్కుమాలిన యినప వడియాలు" అని తిట్టుకుంటూ పిల్లవాడ్ని తీసుకుని యింటి కెళ్లింది.

యింక ఆ వడియా లక్కడ వుంటే ప్రమాదం అని తక్షణం బయట పారేయించాను, మా అత్తగారు చూడకుండా.

అక్కడా వాటిని వదల్లేదు. ఎదురింటి ఆడపిల్లలు....బిల్ల పెంకులకు బదులు, ఆ వడియాల్నే తొక్కుడు బిళ్లలుగా ఉపయోగించి ఆడుకున్నారు. ఆ తర్వాత వడియాలు కావాలని మేం అడగనూ లేదు; మా అత్తగారు వెయ్యనూ లేదు. కూతురొస్తోందనగానే మళ్లీ వడియాలకు దుబ్బడాని కూర్చున్నారు.

"అన్నట్లు మర్చే పోయానేవ్.... రేపటికి నెయ్యిలేదు - ఎట్లా ! కాఫీ పొడి గూడా అయిపోయినట్లే వుంది. దానికి అన్నం అక్కర్లేకపోయినా రోజుకు అయిదారు సార్లయినా కాఫీ కావాలి. రేపు ఆదివారం గూడానూ. త్వరగా ఓ కాగితం పెన్సిలూ తీసుకొచ్చివ్వవే" అంటూ చెయ్యి కడుక్కున్నారు.

"అట్లాగే బజారు సామాన్లుకూడా తెప్పించండి. కందిపప్పు, మినప్పప్పు చక్కెర అన్నీ రేపటిదాకా వస్తాయి" అన్నాడు వంటవాడు నసుగుతూ.

"ఫిడాబోయింది పో. ఫస్టుతారీకు పది రోజు లుందనంగానే అన్నీ నిండుకున్నాయా ! బాగానేవుంది. ఊ, సరే. మళ్ళీమళ్ళీ ఎందుకూ! ఒకేసారి చెప్పు. ఏమేంకావాలో రాసేస్తా. మళ్ళీ రేపు ఆదివారంకూడా.'' అంటూ పెన్సిలు, కాగితం తీసుకుని కూర్చున్నారు మా అత్తగారు.

"కందిపప్పు పదిమానికెలు.''

"ఓరి నీపదిమానికలు దొంగల్దోలా! హవ్వ ! ఎందుకురా పదిమానికెలు ! యింకానయం పదిబస్తా లన్నావు కావు'' అంటూ పడీపడీ నవ్వారు మా అత్తగారు.

''వెనకటికి మా ముత్తాతగారింట్లో ఎనభైమంది జనాభాకూ నెలకు పది బస్తాల పప్పు ఉడికేదట. ఆకాలంలో పప్పే ప్రధానం. అట్లావుంది నువ్వు చెప్పేది. ఆ తర్వాత ! మినప్పప్పు ?"

"అయిదు మానికెలు".

"ఓరి నీయింట వాన గురవా ! ఎందుకురా అయిదుమానికెలు ! వెనకటి మా బంధువుల్లో ఒకావిడ నిత్యా మినప గారెలు తింటానికే వున్న ఆస్తంతా తగలేసిందట. బస్తాల బస్తాల మినప్పప్పు తినీ తినీ చివరకు పుట్టెడు చెవుడుతో పోయిందట ఆయిల్లాలు" అంటూ మళ్లీ నవ్వారు మా అత్తగారు.

వంటవాడు చిన్నబుచ్చుకున్నాడు.

"ఆఁ మాటసామెతకన్నా గానీ, తొందరగా తెములు మరి. యిట్లా ఒక్కొక్కటీ చెప్తే ఎప్పటి కయ్యేట్టు! వరసగా చెప్పుకుపో, నే రాసుకుంటూ పోతాను'' అని మాఅత్తగా రంటుంటే, వంటవాడు పరుగు లంకించుకున్నాడు. "ఆవాలు మెంతులు, మిరియాలు, ధనియాలు, జీలకర్ర అయి దయిదు ఫలాలూ, నూనే అయిదు వీశలూ, చింతపం డొక వీశే, ఎర్రగడ్డలు వీశా తెల్లగడ్డ లరవీశా, ఉప్పు మానెడు, ఎనిమిది వీశలు



చక్కెరా, టన్నుకట్టెలూ, పిండిగోధుమలూ, రవ్వగోధుమలూ, బార్‌సోపూ, పళ్లపొడీ, పన్నెండు అగ్గిపెట్టెలూ, ఒక యల్. జి. యింగువ పెట్టె, కేసరి పౌడరూ.''

''ఒరేయ్ ! యిహ ఆపరా నీదండకం, అంగడంతా కొనిపించేట్టున్నావే! సధ్యానికి ముందీ సామాన్లు ఖర్చుకానీ, తర్వాత చూసుకోవచ్చు'' అంటూ లిస్టు పూర్తిచేసి, పనిపిల్లవాడిచేతి కిచ్చి చెట్టి అంగడినుంచి సామాన్లు పట్టించుకు రమ్మని పంపించేశారు.

రాత్రి పదిగంటల ప్రాంతాల్లో రెండు రెండెడ్లబండ్లూ, ఒక తోపుడు బండీ వచ్చి యింటిముందాగాయి.

అంత రాత్రప్పుడు రెండెడ్లబండ్లల్లో ఏ పల్లెటూరువాండ్లొచ్చారబ్బా! అనుకుని బయటికెళ్లి చూస్తే బండ్లవెనకాల చెట్టికొడుకూ, మా పనిపిల్లవాడూ సైకిళ్లు దిగుతున్నారు. నన్ను చూస్తూనే చెట్టికొడుకు నమస్కారం చేసి, 'మన యింట్లో విశేషం' అని 'కాస్త ముందుగానే తమరు కబురు చేసినట్టయితే అన్ని సామాన్లూ మా అంగడినుంచే సప్లయి చేసేవాళ్లం. ప్రస్తుతం వున్నంతవరకూ మా అంగట్లోవీ, పక్క అంగళ్ళల్లోవీ తీసుకొచ్చాను'.

"మీరు పంపిన లిస్టు ప్రకారం సామాన్లన్నీ పూర్తిగా తేలేకపోయినందుకు క్షమించాలి. తమరు పంపిన




'' నిజంగా నిద్రపోతోందా ? ''

లిస్టులో పదిబస్తాల కందిపప్పు గ్గాను, ప్రస్తుతం మాఅంగట్లో వుండేది నాలుగు బస్తాలు తెప్పించి మొత్తం ఎనిమిది బస్తాలే తెచ్చాను. కొరవబడ్డ రెండు బస్తాలూ, రేపుతెల్లారేసరికల్లా పంపుతాను. అట్లాగే అయిదు బస్తాల మినప్పప్పుగ్గాను, మూడుబస్తాలే తెచ్చాను, అదీ మా అంగట్లో ఒకటిన్నర బస్తా పప్పే వుండింది. మిగతా బయట అంగళ్లనుంచి తెప్పించాం. చిన్నచిన్న చిల్లర సామా నంతా మామూలుగా పంపే తోపుడుబండిలోనే తెచ్చా; యిహపోతే వీశకట్టెలూ, ఎనిమిది టన్నుల చక్కెర అని వ్రాసుంది లిస్టులో. అదిపొరపాట్న రాశారేమోకనుక్కునిపోదామని వచ్చాను. ఎందుకంటే ప్రస్తుతం మార్కెట్లో చక్కెర దొరకడం చాలకష్టంగావుంది. వీశచక్కెర కోసం జనం 'క్యూ'లో

నిలబడి పడిగాపులు పడుతున్నారు'' అంటూ చెట్టికొడుకు చెబుతూంటే గుడ్లప్పజెప్పి వింటూ కొయ్యబారి నిలబడ్డాను. "ఎవరే బండ్లల్లో వచ్చిందీ! కొంపతీసి పెండ్లి కొచ్చిన పల్లెటూరి బంధువులెవరైనా విడిదిల్లనుకొనిరాలేదు గదా! అంటూ లోపల్నుంచొచ్చారు మా అత్తగారు.

"నమస్తారం పెద్దమ్మగారూ. తమరు రాసి పంపిన లిస్టులో సామాన్లన్నీ కాస్త కాస్త కొరవబడ్డందుకు క్షమించండి. పదిబస్తాల కందిపప్పుగ్గాను ఎనిమిది బస్తాలే తెచ్చాను. మినపప్పుగూడా రెండుబస్తాలు కొరవడ్డాయి. ఆరెండూ రేపు పంపించేస్తా ననుకోండీ; కాని చక్కెర దొక్కటేకష్టం. అసలది ఎంత రాశారో కనుక్కొనిపోదామని వచ్చాను. ఎనిమిది టన్నుల చక్కెరా లేక...."

"ఓరి నీ టన్ను ల్దొంగల్దోలా! యీ బండ్లేమిటీ, యీ బస్తా లేమిటీ! హవ్వ! ఏమిటీ అన్యాయం! నీకేం మతి గితీ పోలేదుగదా అబ్బీ.''

"చెట్టికొడుకు వెలవెలబోతూ "తమరు పంపిన 'లిస్టు' ప్రకారమే తెచ్చాను. అన్నీ'' అన్నాడు.

"ఛాల్లే వూరుకో పెద్దమషి. ఎవరైనా నవ్విపోతారు. నే రాసిన లిస్టులో ఇన్ని సామాన్లు రాశానా! ఏదీ చూపించు లిస్టు" అంటూ నిలేశారు చెట్టికొడుకును.

చెట్టికొడుకు జేబులన్నీ వెదుక్కున్నాడు. కనిపించలా. పనిపిల్లాడి నడిగాడు. "మీరే తీసుకున్నారుసార్'' అన్నాడు. ఖంగారు పడుతూ 'యిప్పుడే వస్తాను' అంటూ సైకిలుతీసుకుని పరుగెత్తాడు చెట్టికొడుకు.

''అన్నీ దొంగవేషాలూ, దొంగ బుద్ధులూనూ. అంగట్లో అమ్ముడుబోని సరుకంతా వూళ్ళోవాళ్ల నెత్తి క్కట్టాలంటే ఎట్లా.

న్యాయం వుండక్కర్లా! యిట్టా ఎవరైనా రాస్తారా. ఇంత అన్యాయం చేస్తుండబట్టే ఆర్నెల్లక్రితం అంగట్లో వుండేవన్నీ పట్టపగలే దొంగ ల్దోచుకు పొయ్యారు!" అంటూ చెట్టికి అష్టోత్తరం జరుగుతుండగానే చెట్టి కొడుకు పరుగెత్తుకొచ్చాడు సైకిల్ పై.

"లిస్టు కాగితం దార్లోనే దొరికింది. కర్చీఫ్ తీస్తుంటే కింద పడ్డట్టున్నది. యిందాండి మీరు రాసిపంపిన లిస్టు'' అంటూ మా అత్తగారి చేతి కందిచ్చాడు, ఆయాస పడుతున్న చెట్టికొడుకు. మా అత్తగారు లిస్టులో తనేం రాశారో చూసేలోగానే నేను దొంగలాగా లోపలకు జారుకున్నాను.

కాసేపటికి బండ్లు వెళ్ళిపోయిన చప్పుడు వినిపించింది. గప్‌చిప్‌గా లోపలికొచ్చారు మా అత్తగారు.

మర్నాడు తెల్లవారుఝామున నేను లేచేసరికే మా అత్తగారు లేచి నీళ్ళ



పొయ్యి అంటించారు. రాత్రి మావారు ఆలస్యంగా రావడంవల్ల డ్రైవర్‌తో చెప్పడం మర్చిపోయిన నేను పిల్లిలాగా వెళ్లి పనిపిల్లవాడ్ని లేపాను.

పనిపిల్లాడు లేచి కూర్చుని కాసేపు నిద్రపోయాడు. మళ్ళీ తట్టిలేపాను. నిలబడి కాసేపు నిద్రపోయాడు. చివరకు యిట్లా కాదని చెంబుడు నీళ్ళు తెచ్చి వాడి నెత్తిన బోశా. ఇహ పిచ్చెత్తినట్టు కలవరిస్తూ యిల్లంతా పరుగెత్తడం మొదలెట్టాడు. మా అత్తగారు డ్రైవర్ సంగతి అడిగేలోగా కబురు పెడదామనుకుంటే ఎంతకీ వాడు స్పృహలోకి రాలేదు. మూల వున్న పేంబెత్తంతో ఒక్కటి తగిలించా. దాంతో అదిరిపడి, "బాబోయ్! అమ్మగారూ, ఏంటీ! ఏంటీ! అంటూ యీలోకంలో పడ్డాడు.

''అర్జంట్‌గా సైకిల్లో వెళ్లి పెద్దకారుడ్రైవర్ పెంటసామిని పిల్చుకు రావాలి; స్టేషనుకు కారు తీసుకెళ్ళాలని చెప్పు. అర్జంట్'' అంటూ పంపించేశాను డ్రైవ రింటికి.

పది నిముషాల్లో తిరిగొచ్చేశాడు. పెంటసామికి ఒంట్లో బాగా లేదనీ, అయ్యగారిదగ్గర లీవు తీసుకుని రాత్రే వూరి కెళ్ళాడనీ, అంచేత చిన్న కారు డ్రైవరు మురుగుసామిని అర్జంట్‌గా రమ్మని చెప్పొచ్చాననీ చెప్పాడు.

నా గుండెల్లో రాయిపడ్డది. మా అత్తగారికి మొదట్నుంచీ మురుగుసామితాత



"నడివీధిలో బిచ్చమెత్తావు అది నేరం.''
"బిచ్చమెత్తలేదు, బాబూ, కుటుంబ ఖర్చులకు చందాలు వసూలు చేసుకుంటున్నాను.''

డ్రైవ రంటే, ఒళ్లు మంట. దానికి కారణాలు లేకపోలేదు. ఒకసారి మురుగుసామితాత డ్రైవ్ చేస్తే మా చిన్నకార్లో దేవాలయాని కెళ్ళాం. మా అత్తగారూ నేనూ. తిరిగివచ్చే వేళకు కాస్త చీకటిపడ్డది. అప్పటి కింకా దీపాలు గూడా పెట్టారో లేదో. యింక మా మురుగుసామితాత రోడ్డు వదిలేశాడు. పేవ్‌మెంట్ మీద నడిచేజనం మీదిమీదికి పోయి ఒదిగి నడిచేవాళ్ళందర్నీ యుడిపించడం మొదలెట్టాడు. ఎదురుగ్గా, ఓ పెద్దలారీ భయంకరంగా హెడ్‌లైట్స్ వేసుకుని వస్తూంటే మా మురుగుసామి తాత కండ్లు చీకట్లు కమ్మాయి. అమాంతంగా ఆ లారీతో ఢీకొట్టుకోబోయి,

చటుక్కున పక్కకు తప్పుకోడంలో రోడ్డు పక్కనుండే చెట్టెక్కించాడు మమ్మల్ని. సగం చెట్టెక్కిన కారు 'సడన్'గా వెనక్కి తగ్గడంలో మా నడుములు విరిగాయి. సిలోన్ టెంకాయ లాంటి మా అత్తగారి తలకాయ వెళ్లి కారు వెనకవైపు గ్లాసుకు తగిలి సహస్ర తునకలయింది. పోలీసులు చేరకముందే ఎట్లాగో ఆ చోటునుంచి బయటపడ్డాం. ఆరోజునుంచీ మా అత్తగారికి మురుగుసామితాతంటే హడల్. "అసలా గుడ్డిపీనుగు రోడ్డుమీద కారు నడపడం మానేసి చాలాకాలం ఐందే. వాడి దృష్టంతా రోడ్డుపక్కనుండే చెట్లమీదా, స్థంభాలమీదా వుంటుంది. మీరు గాబట్టి యింకా ఆ ముసలి పీనుగును డ్రైవర్‌గా అట్టేపెట్టుకున్నారు గానీ, యింకెవళ్ళయినా అయితే తన్ని తగిలేస్తారు. యిహ ఆ మురికివెధవ కార్లో చస్తే కూర్చోను" అంటూ ఆనాట్నుంచీ శపథం పట్టారు మా అత్తగారు.

తీరా తన కూతుర్ని స్టేషన్నుంచి తీసుకురావడానికి మురుగుసామే వెళ్తున్నాడని తెలిస్తే చిక్కే! మా అత్తగారు కేకేశారు.

"మేలు ఎన్నింటికొస్తుందో అబ్బాయి నడిగావా! డ్రైవరుకు కబురు పెట్టావా? అంటూ ప్రశ్నించారు.

"ఆ. యీపాటికి వస్తూండాలి," అన్నాను.

"ఎవరూ, పెంటవెధవా! మురికి వెధవా!

"మురుగుసామే."

"ఆఁ అంటూ అదిరి పడ్డారు మా అత్తగారు."

"హయ్యో నెత్తిరాతా! ఆ గుడ్డి పీనుగు నెందుకు రమ్మన్నావే."

"పెంటసామిక్కి ఒళ్ళు బాగాలేదని 'లీవు'లో ఏదో వూరికెళ్ళాట్ట. మరి ఎవరో ఒకరు స్టేషనుకు బండి తీసుకెళ్ళాలిగా."

"అది సరే. యీ మురికి వెధవ సమంగా రోడ్లో వస్తాడో లేక దాన్ని తీసికెళ్ళి చెట్లెక్కిస్తాడో ఎట్టా తెలుస్తుందే! సరే ఏం చేస్తాం! దాని అదృష్టం, నా అదృష్టం అట్టా వుంది. అంటూ తలబట్టు కూర్చున్నారు మా అత్తగారు.

"అమ్మా! స్టేషనుక్కారు తీసికెళ్ళమన్నారంటనే. అంటూ డ్రైవర్ మురుగుసామి గొంతు వినిపించింది. మా అత్తగారే లేచి బయటి కొచ్చారు.

"ఒరే మురుగూ! అమ్మాయొస్తాందిప్పుడు మేల్లో. స్టేషనుకు కారు తీసు కెళ్లు. తెలిసిందా! ఆఁ అన్నట్టు అమ్మాయి నెరుగుదువుగా! పదేళ్ళ నాడు అదీ, దాని మొగుడూ వచ్చారు, జ్ఞాపకం వుందా! యిప్పుడది ఒక్కత్తే ఒస్తోందిలే. అన్నట్టు దాని మొగుడు పోయాక నువ్వు చూళ్లేదు గదూ!



అప్పటికీ యిప్పటికీ దాని అవతారమే మారిపోయిందిలే. నువ్వు చూచినప్పటికీ యిప్పటికీ మనిషి ఒక్క పిసరు లావెక్కినట్టు కనిపిస్తుంది. యిదంతా నీ గుర్తుకోసం చెబుతున్నా. యింతెందుకు! అమ్మాయిని కనుక్కోగలిగావా సరేసరి, లేదా ఒకపని చెయ్యి. మేల్లోనించి ఏ విధవాడబడుచు దిగినా, దగ్గిరకెళ్లి 'అమ్మా మీరు అచ్యుతరామయ్యగారింటి పెళ్లికేనా ఒచ్చారు!' అని అడుగు. చాలు. అవునూ అంటే మారుమాట్లాడకుండా కార్లో ఎక్కించుకునిరా. ఒక్కటే సంగతి. త్వరగా వెళ్లు. మేలొచ్చే వేళయింది లాగుంది. అమ్మాయి కాస్త నల్లగా వుంటుంది.. జ్ఞాపకం పెట్టుకో. అచ్యుతరామయ్యగారింటి పెళ్లికొస్తోంది" అంటూ కారు బయల్దేరింతర్వాత కూడా కూతుర్ని కనుక్కునే గుర్తులన్నీ వెనకనించి కేకలేసిచెప్పారు డ్రైవర్ మురుగుసామికి. కారు అటు వెళ్తూనే పెళ్లియింటి కొచ్చిన బంధువుల్లో ఒక ముసలాయన మా అత్తగార్ని చూసిపోదామని వచ్చాడు. "ఏం అమ్మణ్ణీ! బాగున్నావా! ఎన్నేళ్లయింది నిన్ను చూసి! చిన్నప్పుడు పరికిణీ చొక్కా వేసుకొని మా యింటికి ఆడుకోడాని కొచ్చేదానివి. గుర్తుందా!" అన్నాడా ముసలాయన కుర్చీలో కూలబడుతూ. ఆ ముసలాయన ఎవరో మా అత్తగారికి గుర్తు లేదని ఆమె



"గవర్నరుగారు నాతో మాట్లాడార్రా!"
"అలాగాండీ? ఏమన్నారండీ?"
"మన టెలిఫోన్ నంబరు ఎంతా అని అడిగారు. చెప్పాను. 'రాంగ్‌నంబర్' అన్నారువారు.'"

ముఖం చూస్తూనే గ్రహించాను. ఆ మనిషి ఎవరో మనసులోనే గుర్తు చేసుకోడానికి ప్రయత్నిస్తూన్న మా అత్తగారు పైకి తేలకుండా "ఆఁ గుర్తు లేకేం. అంతా బాగున్నారా!" అన్నారు.

"అంతా ఎవరున్నారే అమ్మణ్ణీ! అంతా పోయారు. మిగిలింది నేనొక్కణ్ణీ. అన్నట్టు పరాంకుశంగాణ్ణి ఎరుగుదువుగా!"

మా అత్తగారి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డది.

"ఆఁ ఆఁ ఎరక్కేం! చిన్నప్పుడొట్టి లబోదాగా తిరుగుతుండేవాడూ." ఇంకా ఏమో అనబోయారు మా అత్తగారు.

"అబ్బెబ్బే వాడు వేరే" అన్నాడా ముసలాయన. గతుక్కుమన్నారు మా అత్తగారు.

"వీడు ఎమ్మే గిమ్మే చదివి లండను గిండను వెళ్ళొచ్చాడు. నువ్వు చెప్పే లబోడా వెధవ బహుశా రంగనాథం కొడుకు పరాంకుశం అయివుంటాడు" అన్నాడా ముసలాయన. వాళ్ళిద్దర్నీ ఎరగని మా అత్తగారి ప్రాణం ఆ మాటతో కుదటపడ్డది. ఎవడో ఒక పరాంకుశం లబోడా అయితే అంతే చాలానిపించిందా సమయానికి ఆవిడ ప్రాణానికి. అసలా ముసలాయనే ఎవరో యింకా మా అత్తగారికే అంతు చిక్కక అవస్థలో పడ్డారు. "సరే వస్తా. రేపు పెళ్ళినాడు అటొస్తావుగా నీ కోడల్ని తీసుకునీ. అన్నట్టు నీ కూతురు కూడా రావాలనుకుంటాను పెళ్ళికి!" అంటూ లేచాడు.

"ఆఁ యీవాళే మెయిల్లో వస్తూంది. స్టేషనుకు కారుగూడా పంపాం. అదొచ్చాక అటొస్తాలెండి" అంటూ ముసలాయన్ని గేటుదాకా సాగనంపి వచ్చారు మా అత్తగారు.

పదిగంట లయినా మా ఆడబిడ్డ రాలేదు. "ఏమిటే అమ్మా యింకా రాలేదూ! మెయిలొచ్చిందీ లేందీ అబ్బాయికి టిల్లిఫోను చేసి కనుక్కోమను" అన్నారు ఆదుర్దా పడుతున్న మా అత్తగారు.

నేను నేరుగా స్టేషనుకే టెలిఫోన్ చేసి కనుక్కుంటే నాలుగ్గంటలు లేటన్నారు కలకత్తా మెయిలు.

"హయ్యో నెత్తి రాతా! అయితే దానికి నిన్నా యీవేళాగూడా ఏకాశేన్న మాట. రైల్లో కూర్చుంటే పచ్చిగంగ ముట్టుకోదే అదీ. శ్రీరామ చంద్రా, ఏం చేసేది?" - అంటూ ఆరాటపట్టం మొదలెట్టారు మా అత్తగారు. కాసేపు యిల్లంతా కాలుగాలిన పిల్లిలాగా తిరిగారు. వంటంతా ముగించి, అన్నీ సిద్ధంచేసి, చల్లారిపోయిన వేణ్ణీళ్ళ పొయ్యికింద మళ్ళీ మంటేసి వచ్చి "యింకా మే ల్రాలేదటే?" అన్నారు. మళ్ళీ టెలిఫోన్ చేశా స్టేషన్‌కి. మెయిలొచ్చి చాలాసేపయిం దని వాళ్ళు చెబుతుండంగానే వాకిట్లో కారొచ్చి ఆగింది. "అమ్మాయొచ్చేసిందే!" అంటూ ఎంతో ఆప్యాయంగా మా అత్తగారు గబగబా కారుదగ్గిరికి పరుగెత్తారు.

"పెళ్ళివారిల్లు యిదేనా!" అంటూ ముసుగు సవరించుకుని కార్లోనించి దిగింది నల్లగా లావుగా వున్న ఒక విధవావిడే. ఒక్కక్షణం మా అత్తగారు గుడ్లు తేలేసి నోట మాటలేకుండా కొయ్యబారి నిలబడిపొయ్యారు.

"ఈమే నమ్మా తమరు చెప్పిన అచ్యుతరామయ్య గారింటి పెళ్ళికొచ్చారు" అంటూ నీళ్ళు నమిలాడు డ్రైవర్ మురుగుసామితాత.




"ఓరి నీ అచ్యుతరామయ్య అడువులు బట్టిపోనూ. యీవె దెవర్రా! అమ్మాయేదిరా త్రోష్టం! దాన్నే అడువులు పట్టించావ్! అట్లా గుడ్లప్పజెప్పి చూస్తావేమిట్రా గుడ్డిపీనుగా! జవాబు చెప్పి ఏడువు" అంటూ మా అత్తగారు ఒక్క అరుపు అరిచేసరికి త...త....తమరు..., చె....చె.... చెప్పిన .... అంటూ తడబడ్డాడు మురుగుసామితాత...ఎవరైనా కాస్త గట్టిగా కోప్పడితే నత్తొస్తుంది మురుగుసామితాతకు.

"అయితే పెళ్ళిల్లు యిదిగాదన్నమాట. ఎష్టాగూ' యింతకూ రావాల్సిన మీ అమ్మాయి ఏ వూర్నుంచి రావాల్నండీ!" అని అడిగింది సైను పంచావిడ.

"మీ వూర్నుంచి మాత్రం కాదు. అయినా తెలీకడుగుతాగానీ, ఎవరమ్మా నువ్వు! ఎవరికోసమో ఒచ్చిన కార్లో నువ్వెట్టా వచ్చావుంట! అడగక్కర్లా! ఎవరికోసం వచ్చిందీ కారు ఏమిటీ అని విచారించక్కర్లా!" అంటూ ఆ సైను పంచావిణ్ణి ఝాడించారు మా అత్తగారు.

"బాగుందండోయ్ బామ్మగారూ. పెళ్ళింటికి వంట మనిషి హోదాలో వచ్చానుగానీ, నేనేం మీ యింటికి ముష్టికి రాలేదు. రైలు దిగ్గానే మీ డ్రైవర్ నా దగ్గిర కొచ్చి ఫలానా అచ్యుతరామయ్యగారింటి పెళ్ళికేనా ఒచ్చారు. అష్టాని అడిగాడు. అవునంటిని. వెంటనే నా చేతులో వున్న



పెట్టె లాక్కునివెళ్లి కార్లో పెట్టాడు. అతడి వెనకాలే నేనూ రావాలంటారా ఒద్దంటారా !"

"నాకు తెలుసు వీడిట్లాంటిదేదో చేస్తాడని" అంటూ కారెక్కారు మా అత్తగారు. "మొదటే నే వెళ్లంటే యింత అనర్థం లేకుండా పోయేది. నిన్నట్నుంచీ అన్నం నీళ్లూ లేకుండా బిడ్డ ఏం అగచాట్లు పడుతోందో. కారు కోసం కాచుకుని ఏం పడిగాపులు పడుతోందో. చూస్తావేంరా బయల్దేరూ" అంటూ ఒక్క అరుపు అరిచారు. గజగజ లాడుతున్న మురుగుసామితాత పిల్లిలాగా కార్లో కూర్చుని కారు స్టార్టు చేశాడు. కారు బయల్దేరే లోపుగానే మరో టెలిగ్రాం వచ్చింది. మా ఆడబిడ్డ 'కొన్ని అసందర్భాలవల్ల పెళ్ళికి రావడం లేదనీ, గాభరా పడవద్దనీ, అయిదారెళ్లల్లో తను తప్పక వస్తాననీ, స్టేషను కార్కు పంపవద్దనీ' యిచ్చింది.

'హయ్యో నెత్తి రాతా, అయితే యిప్పట్లో బిడ్డను చూసే ప్రాప్తం లేదన్నమాట' అంటూ ఒక్క నిట్టూర్పు విడిచి కారు దిగారు మా అత్తగారు. వెంటనే కారెక్కింది సైను పంచావిడ.

"కాస్త నన్నా పెళ్ళివారింటిదగ్గిర దించమనండి బామ్మగారూ. నాకోసం కనిపెట్టుకోనుంటారు అంతా" అన్నది. "ఊఁ సరే తప్పేదేముంది! ఆవిణ్ణి తీసుకెళ్లి పెళ్లివాళ్లింటిదగ్గిరట దిగవిడిచిరా. తీసుకొచ్చావుగా" అన్నారు ఆవిణ్ణిచూస్తే ఒళ్ళు మండిపోతున్న మా అత్తగారు.

"వెళ్ళొస్తానమ్మాయ్. వస్తానండీ బామ్మగారూ" అన్నది కార్లోకూర్చున్న సైను పంచావిడ.

"ఊఁ ఊఁ మళ్ళీ రాక్కర్లేదులే, వెళ్లు - అపశకునంలాగా వచ్చింది" అని సణుక్కుంటూ లోపలి కెళ్లిపోయారు మా అత్తగారు.



# జరుగుతున్న చరిత్ర

ప్రపంచంలో నేడు ఏమూల యేసంఘటన జరిగినా - అది క్యూబా కానివ్వండి, కాంగో కానివ్వండి, లేక జపాన్ కానివ్వండి - అగ్రరాజ్యాల జోక్యంతో క్లిష్టమైన సమస్యగా తయారయి శాంతికి ప్రమాదం ఏర్పడుతున్నది. ఆరోపణలు ప్రత్యారోపణలు నేడు సర్వసామాన్యమైపోయినవి; ఏ నిమిషంలో ఏ ఘటన ఎంతటి విపత్తును సృష్టించగలదో ఊహించలేనంత అస్థిమితత్వం ఈనాటి రాజకీయాలలో కాన్పిస్తున్నది. పరిస్థితులు ఈ విధంగా ఉన్నా ఒకటి మాత్రం నిజం; నేడు అంతా శాంతిని వాంఛిస్తున్నారు. యుద్ధాన్ని ద్వేషిస్తున్నారు. అశాంతిని సృష్టించే, అభ్యుదయాన్ని మంటగలిపే చర్యలకు ఎవరు దిగినా, వానికి బాధ్యులు ఎవరైనా ప్రపంచం క్షమించదు.

జపాన్‌లో కిషి ప్రభుత్వం పోయి హయాటొ ఇకెడా అధికారంలోకి వచ్చాడు; ఇది వ్యక్తి మార్పు తప్ప పార్టీ మార్పు కానందున ప్రభుత్వ విధానాలలో కాన్పించే మార్పు పేర్కొనదగినంతగా ఉండబోదు. వచ్చే హేమంతరుతువులో జరుగనున్న జనరల్ ఎన్నికలుగాని, జపానీయులు అమెరికాతో చేసుకున్న రక్షణ ఒప్పందానికి అనుకూలంగా ఉన్నదీ లేనిదీ స్పష్టం చేయబోవు. ఎన్నికలలో ఒక పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చినంత మాత్రాన ప్రభుత్వం నడక సాఫీగా సాగిపోతుం దనడానికి ఈ రోజుల్లో ఆస్కారం కాన్పించడం లేదు. ఉద్యమాలు ఆందోళన సృష్టించి బలప్రయోగం ద్వారా ప్రతిపక్షాలు, చట్టబద్ధంగా అధికారంలోకి వచ్చిన పార్టీల గద్దెదించడానికి ప్రయత్నాలు చేస్తుండటంవల్లనే పెక్కు అనర్థాలు ఏర్పడుతున్నాయి. జపాన్ పార్లమెంటు దిగువ సభలో అధికార పక్షం 'లిబరల్ డెమాక్రాట్ల'కు మూడింట రెండువంతుల మెజారిటీ ఉన్నది. 451 సభ్యులుగల ఈ సభలో మిగితా పార్టీల బలం 165 అయినా సోషలిస్టులు, డెమాక్రాటిక్ సోషలిస్టులు కార్మిక విద్యార్థి వర్గాలలో అధిక పలుకుబడిని కల్గి అమెరికాకు వ్యతిరేకంగా ఉప్పెనలాంటి ఆందోళనను సృష్టించగలిగారు. ఇట్టి పరిస్థితుల్లో జపాన్ ఎంతవరకు తన ప్రజాస్వామిక

'జయదేవ్'